# సంపాదకీయం

## వెంటాడే కలాలు ఇంకా వెంటాడుతున్న ప్రశ్నలు

తెలుగు సాహిత్యంలో కొన్ని పుస్తకాలు కాలంతో పాటు పాతబడిపోతాయి. మరికొన్ని కాలాన్ని దాటి సమాజాన్ని ప్రశ్నిస్తాయి. 'వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు' రెండో కోవకు చెందిన సంకలనం. అది కేవలం కవితల పుస్తకం కాదు. ఒక సమాజం తనగురించి తానే ప్రశ్నిస్తూ మాట్లాడుకోవడం ప్రారంభించిన చారిత్రక దశకు ప్రతిరూపం. 2001లో జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువడిన 'వెంటాడే కలాలువెనుకబడిన కులాలు' ఈ సంకలనాన్ని బీసీ అస్తిత్వ సాహిత్య చర్చల్లో ఒక మైలురాయిగా గుర్తించారు. ఈ సంకలనం బీసీ వాద కవిత్వానికి ముఖ్యమైన మలుపుగా సాహిత్య పరిశోధకులు పేర్కొన్నారు. ఇతరుల దృష్టి నుంచి స్వీయ అనుభవం వరకు అస్తిత్వ సాహిత్య ఉద్యమాల ముఖ్యమైన ప్రశ్న 'మా గురించి మేం ఎందుకు రాయకూడదు?'. బీసీ సమాజం గురించి బయటి దృష్టితో రాసిన రచనల్లో వారి వృత్తులు, పేదరికం,గ్రామీణ జీవితం కనిపించవచ్చు. కానీ ఒక సమాజపు శ్రమను, అవమానాన్ని,ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని తన స్వీయఅనుభవం నుంచి పలికించినప్పుడు ఆ స్వరానికి వేరే రాజకీయ అర్థం వస్తుంది. 'వెంటాడే కలాలు' ఆ స్వీయ అనుభవానికి వేదికగా మారింది. 1990లో తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలుబలపడుతున్నసమయంలో'చిక్కనవుతున్న పాట' (1995), 'బహువచనం' (1996)వంటి సంకలనాలు వెలువడ్డాయి. ఆ సాహిత్య స్ఫూర్తితోనే 2001లో 'వెంటాడే కలాలువెనుకబడిన కులాలు' బీసీ అస్తిత్వాన్ని మరింత ప్రత్యేకమైన సామాజికసాహిత్య దృక్పథంతో అడుగులు ముందుకు వేసింది. అందుకే దీనిని బీసీ అస్తిత్వ సాహిత్యానికిఒక కీలక మలుపుగాగుర్తించటం సముచితం. శ్రమ కనిపిస్తుంది. శ్రామికుడు ఎందుకు కనిపించడు? భారతీయ సమాజ నిర్మాణంలో ఉత్పత్తి శ్రమకు బీసీ వృత్తి సమూహాల పాత్ర విశిష్టమైనది. మట్టిని మలిచిన కుమ్మరి నుంచి ఇనుమును కరిగించిన కమ్మరి వరకు, మగ్గంపై వస్త్రాన్ని నేసిన నేతన్న నుంచి పశుపోషణతో జీవన వ్యవస్థను నడిపిన గొల్లకురుమల వరకు, తాటిచెట్టుతో జీవనాన్ని ముడిపెట్టుకున్న గౌడ నుంచి చెరువుస ముద్రాలపై ఆధారపడి బతికిన మత్స్యకారుడి వరకు, చౌడు సున్నాల తెలుపు నుంచి యవ్వనప్రాయపు సొగసులను అందంగా తీర్చిదిద్దే రజక, క్షురకర్మలు.శ్రామిక శ్రమ భారతీయ సమాజంతో ముడిపడి ఉంటుంది. కానీ చరిత్ర రాసినప్పుడు శ్రమ కనిపించినంతగా శ్రామికుడు కనిపించలేదు. అదే 'వెంటాడే కలాలు'లోని అంతర్లీన ప్రశ్న. ఉత్పత్తి చేసిన చేతులకు గౌరవం ఎందుకు తక్కువ? ఉత్పత్తిపై ఆధారపడిన సమాజంలో ఉత్పత్తిదారుడికి అధికారంలో వాటా ఎందుకు తక్కువ? వృత్తి సమూహాలు నిర్మించిన సంస్కృతికి చరిత్రలో సముచిత స్థానం ఎందుకు లేదు? ఇవి కేవలం కవితలోని ప్రశ్నలు కావు. సామాజిక నిర్మాణాన్ని ప్రశ్నించే ధిక్కార స్వరాలు. ఈ సంకలనంలో వెనుకబడిన కులాల జీవిత అనుభవాలు అనేక స్వరాలుగా పలికాయి. 23 మంది కవులు–73 కవితలతో వచ్చిన సంకలనంగా తెలుగు సాహిత్యంలో చరిత్ర సృష్టించింది.ఇందులోని కవులు; అంబటి వెంకన్న–'వల ఏరియ్యక ముందే'. అనిశెట్టి రజిత–'దొర్సానీ ఓ దొర్సానీ', ఏ.దుర్గాప్రసాద్ –'దేవదాసీ', బెల్లి యాదయ్య–'నేను గొర్రెలు కాస్తుంటాను', బాణాల శ్రీనివాస్ రావు–'కుంపటి', దెంచనాల శ్రీనివాస్–'పురుషుని గుండె లేదా మగ మాదిగ, జి.విజయలక్ష్మి–'పొదిలో కత్తి', జుగాష్ విలి–'కొన్ని వాక్యాలు', జూలూరు గౌరీశంకర్–'కొలిమి', జూపల్లి ప్రేమ్‌చంద్–'నిచ్చెన మెట్ల లోలకం', కో.ప్ర.–'ఊరు మా ఉనికి మింగేసింది', ఎం.వెంకట్–'వెనుకబడ్డ కల', మందారపు హైమావతి–'జ్యూయలరీ షాప్', డాక్టర్ ఎన్.గోపి–'రాజయ్య కథ', 'బొంత', నాళేశ్వరం శంకరం–'శవం ముందు శంఖం', డాక్టర్ నసుమాస స్వామి–'నీలిబాల్యం', పులిపాటి గురుస్వామి–'అయ్యా మల్లెప్పుడొస్తవే', ప్రసాదమూర్తి–'తాతకో నూలుపోగు', ప్రసేన్–'కన్నీటి నది దోచుకెళ్లిన నావ నా పద్యం', సీతారాం– 'రెజ్యూమ్', ఓట్లు ఓట్లో నాయీ బ్రాహ్మ ఓట్లోయ్', డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ–'మొద్దు మీద కత్తి', సిద్దార్థ బొమ్మగాని–'సంగెం', 'జిల్లెడుపొద'.'వెంటాడే కలాలు' వృత్తి అంటే వెనుకబాటుతనం కాదు. శతాబ్దాలుగా చేతివృత్తులను తక్కువగా చూసే సామాజిక దృష్టి ఒక పెద్ద చారిత్రక వైరుధ్యాన్ని సృష్టించింది. శ్రమ అవసరం. శ్రామికుడు అవసరం. అతని ఉత్పత్తి అవసరం.కానీ అతని సామాజిక గౌరవం మాత్రం అనవసరమన్నట్టుగా వ్యవస్థ వ్యవహరించింది. 'వెంటాడే కలాలు' ఈ వైరుధ్యాన్ని కవిత్వ ధిక్కారంతో ఎదురేగింది. వృత్తిని అవమానంగా చూసే దృష్టికి ఎదురు నిలిచి, వృత్తిని జీవన జ్ఞానంగా ప్రతిష్టించింది.ఇది బీసీ అస్తిత్వ సాహిత్యంలో సమాలోచనలో మార్పు. అస్తిత్వం అంటే విభజన కాదు బీసీ అస్తిత్వాన్ని కులాల మధ్య గోడలు కట్టే భావజాలంగా అర్థం చేసుకోవడం సరికాదు. అస్తిత్వం అంటే–తన ఉనికిని గుర్తించడం, తన చరిత్రను తిరిగి రాసుకోవడం, తన శ్రమకు విలువ కోరడం, తన సంస్కృతికి గౌరవం పెంపొందించుకోవడం. తన జనాభాకు తగిన ప్రాతినిధ్యాన్ని ప్రశ్నించుకోవడం. తన ఉనికిని గుర్తించుకోవడం విభజన కాదు; అసమానతను గుర్తించే తొలి అడుగు. వేర్వేరు వృత్తి, కులాలుగా ఉన్న బీసీ సమాజంలో ఉమ్మడి సమస్యలను గుర్తించి సామాజిక న్యాయ దృక్పథంతో సంఘటిత చైతన్యాన్ని నిర్మించడంలో ఈ సాహిత్యం తన పాత్ర పోషించింది.

# అలయ్-బలయ్-2026కు చంద్రబాబుకు దత్తన్న ఆహ్వానం

**ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానం.. సాదరంగా స్వీకరించిన ఏపీ సీఎం**

హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 14: అలయ్-బలయ్-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబు నాయుడిని దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా అక్టోబర్ 22, 2026న హైదరాబాద్‌లో నిర్వహించనున్న అలయ్-బలయ్-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని దత్తాత్రేయ కోరారు.



అలయ్-బలయ్ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా కొనసాగుతోందని, వివిధ రాజకీయ, సామాజిక వర్గాల మధ్య స్నేహం, సోదరభావం, ఐక్యతను పెంపొందించే వేదికగా నిలుస్తోందని ఆయన వివరించారు.దత్తాత్రేయ ఆహ్వానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాదరంగా స్వీకరించారు. అక్టోబర్ 22న జరిగే అలయ్-బలయ్ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు.అనంతరం ఇరువురు నేతలు తెలంగాణ?ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, తెలుగు ప్రజల ఐక్యత, పరస్పర సహకారం తదితర అంశాలపై ఆత్మీయంగా చర్చించారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

**ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు నిర్వహించాలి**
**భక్తిశ్రద్ధలు, ఐక్యతతో పండుగను జరుపుకోవాలి**
**గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలి**
**ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు: రాపోలు లింగస్వామి**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 14:విఘ్నాలకు అధిపతి అయిన శ్రీ వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆర్ టి ఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, జ్యోతి ప్రభంజనం పత్రికా సంపాదకులు రాపోలు లింగస్వామి ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలు, ఐక్యత, సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. విఘ్నేశ్వరుడి కృపతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషం వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లోని కష్టాలు, విఘ్నాలన్నీ తొలగిపోవాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.గణేష్ మండపాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతకు సంబంధించి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.విఘ్నేశ్వరుడి దీవెనలతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ మరోసారి ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.



# గణేష్ నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం.




చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్14 (జ్యోతి ప్రభంజనం):చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోనీ వార్డుల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవ విగ్రహాలకు పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో గణనాథుడిని కొలిచారు. ఉదయం నుంచే మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. రానున్న రోజుల్లో మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# రైతు కోసం అడుగు.. వ్యవసాయం కోసం పోరాటం.. అభివృద్ధి కోసం నాయకత్వం!

**కౌకుంట్లలో రైతుల కరెంట్ కష్టాలకు చెక్ పెట్టే దిశగా మరో ముందడుగు!**
**దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**



దేవరకద్ర జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 14:దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ చొరవతో కౌకుంట్ల మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ చేపట్టారురైతుకు కరెంట్ ఉంటేనే పంటకు పుష్కలంగా నీరు అందుతుంది. పంటకు సమృద్ధిగా నీరు ఉంటేనే రైతు కుటుంబానికి భరోసా...ఆ భరోసా



కాంగ్రెస్ ప్రజా పాలనతో సాధ్యం.రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందన్నారు.అందుకే రైతుల సమస్యలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిష్కారాల దిశగా ముందుకు సాగుతున్నారు.వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది అని జి ఎం ఆర్ స్పష్టం చేశారు.

# పోగు చేసినదే తోడు

మనుషులను పోగు చేయండి
కాలం మారితే వాళ్లే బలమై నిలుస్తారు,
ఒంటరి దారిలో నీడలా తోడై వస్తారు,
కష్టాల మలుపులో భుజమై నిలబడతారు.
డబ్బును పొదుపు చేయండి



అది కాలం దాచిన విత్తనంలా మొలుస్తుంది,
అవసరమొచ్చినప్పుడు అండగా మారుతుంది,
ఆపద తలుపు తట్టినప్పుడు తాళమవుతుంది.
కొత్తదైనా డబ్బే,
పాతదైనా విలువ కోల్పోదు,
ఎక్కడ దాచినా అవసరానికి పనికొస్తుంది,
చేతిలో ఉన్నప్పుడు దాని బలం తెలియదు.
మనుషుల విలువ కూడా అంతే
ఉన్నప్పుడే వారి విలువ తెలుసుకోవాలి,
నిన్ను నిలబెట్టిన భుజాన్ని మరిచిపోకూడదు,
నువ్వు ఎదిగిన మెట్టును తన్నకూడదు.
డబ్బు దాచితే సంపద పెరుగుతుంది,
మంచి మనుషులను దాచితే బంధం పెరుగుతుంది,
డబ్బు అవసరాన్ని తీరుస్తుంది,
మనిషి అవసరంలో మనిషిగా నిలబెడతాడు.
కాబట్టి జీవితమనే గిడ్డంగిలో
డబ్బుతో పాటు మనుషులను కూడా పోగు చేయండి,
రేపటి దారిలో ఏది అవసరమవుతుందో ఎవరికీ తెలియదు,
పోగు చేసిన మంచి మనుషులే నిజమైన సంపద.
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.
చరవాణి : 9866179385

# బంగారు మైసమ్మ దేవాలయంలో వినాయక చవితి తొలి పూజ

### గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

జ్యోతి ప్రభంజనం, మైలార్‌దేవర్‌పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 14:వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మైలార్‌దేవర్‌పల్లి పరిధిలోని గణేష్‌నగర్‌లో వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విఘ్నేశ్వరుడికి తొలి పూజలు నిర్వహించి, ప్రత్యేక హారతి సమర్పించారు.ఈ సందర్భంగా



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలన్నీ తొలగిపోయి, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ భక్తిపూర్వక కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు.

# కుంట్లూర్ శ్రీశ్రీశ్రీ బీరప్పస్వామికమరాతిదేవి బోనాల పండుగ మహోత్సవం

అబ్దుల్లాపూర్ మెట్,జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 14: కుంట్లూర్ గ్రామ శ్రీశ్రీశ్రీ బీరప్పస్వామి శ్రీశ్రీశ్రీ కమరాతిదేవి బోనాల పండుగ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఎంఎంసీ నాగోల్ సర్కిల్ కుంట్లూర్ గ్రామ కురుమసంఘం పెద్దల సమక్షంలో గ్రామ కురుమ కులస్తులు పెద్ద ఎత్తున బోనాలను గ్రామంలోని శ్రీ ఇష్టకామేశ్వరిదేవి దేవాలయం నుండి ప్రారంభమై ప్రదర్శనలు కుంట్లూర్ చౌరస్తా వీధుల గుండా ఒగ్గు కళాకారుల విన్యాసంతో ఆధ్యాంతం ఆసక్తికరంగా సాగాయి. అనంతరం గ్రామంలోని శ్రీ బీరప్ప కమరాతిదేవి దేవాలయంలో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుంట్లూర్ గ్రామ కురుమ సంఘం పెద్దకురుమ దడిగ కొమురయ్య కురుమ, శేలోజీ కంకల సత్తయ్యకురుమ, అధ్యక్షులుగా నీళ్ల జంగయ్య కురుమ, ప్రధాన కార్యదర్శిగా పల్లె మల్లేశం కురుమ, కోశాధికారిగా కోడూరి అశోక్ కురుమ, ఉపాధ్యక్షులుగా రావుల నరసింహ కురుమ, అచ్చిన శీను కురుమ, కమిటీ సభ్యులు గుత్తి రమేష్ కురుమ, బండ శంకరయ్య కురుమ, కార్యదర్శులు నర్రి శ్రీశైలం కురుమ, కొత్తకుర్మ మల్లేష్ కురుమ, కొండే ప్రదీప్ కురుమ, బర్ల లింగస్వామి కురుమ, సహాయ కార్యదర్శులు పాలంచి రాజు కురుమ, మీస బాలరాజు కురుమ, మంగ కృష్ణ కురుమ, మంగ నరసింహ కురుమ, గౌరవ సలహాదారుగా కప్పే రమేష్ కురుమ, అదే మల్లేష్ కురుమ, జమ్ము వీరభద్రం కురుమ,





కమిటీ సభ్యులు జమ్ము యాదయ్య కురుమ, అరిగే లింగస్వామి కురుమ, ఒగ్గు అయోధ్య కురుమ, కుండే బిక్షపతి కురుమ, నర్రి శ్రీశైలం కురుమ, ఒగ్గు కళాకారుల బృందం, కురుమ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బూర్గుల రామకృష్ణారావు సేవలు చిరస్మరణీయం

### తెలంగాణ అభివృద్ధికి, విద్యా?రెవెన్యూ సంస్కరణలకు ఆయన చేసిన కృషి మరువలేనిది
### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బహుభాషా కోవిదుడు, గొప్ప వక్త, సాహితీవేత్త, ప్రజా నాయకుడిగా బూర్గుల రామకృష్ణారావు అందించిన సేవలు చిరస్మరణీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బూర్గుల రామకృష్ణారావు



వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1952లో మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికైన బూర్గుల రామకృష్ణారావు, హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. రెవెన్యూ, విద్యా రంగాల్లో ఆయన చేపట్టిన సంస్కరణలు ప్రజల జీవితాల్లో మార్పుకు బాటలు వేశాయని పేర్కొన్నారు. ఆచార్య వినోబాభావే చేపట్టిన భూదానోద్యమానికి బూర్గుల రామకృష్ణారావు అండగా నిలిచారని ఎమ్మెల్యే తెలిపారు. శివరాంపల్లి నుంచి పోచంపల్లి వరకు సాగిన శాంతియాత్ర, భూదానోద్యమం ద్వారా పేదలకు భూమి అందించాలనే గొప్ప ఆలోచనకు బలం చేకూరిందన్నారు. నాటి రెవెన్యూ మంత్రిగా బూర్గుల ఈ ఉద్యమాన్ని సమర్థించడం ఆయనకు సామాజిక న్యాయం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బూర్గుల రామకృష్ణారావు పరిపాలనా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఖమ్మం జిల్లాను ఏర్పాటు చేయడం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రారంభానికి సంబంధించిన కీలక పరిణామాల్లో ఆయన పాత్ర ప్రత్యేకమైనదని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అదేవిధంగా విశాలాంధ్ర భావనకు బూర్గుల రామకృష్ణారావు మద్దతు పలికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు దోహదపడటం ఆయన రాజకీయ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. ప్రజా జీవితంతో పాటు సాహిత్య రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారని, బహుభాషల్లో పాండిత్యం, రచనా ప్రతిభతో సాహిత్య సేవ చేసిన మహనీయుడిగా బూర్గుల రామకృష్ణారావు చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎన్నికై హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎదిగిన బూర్గుల రామకృష్ణారావు చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, బ్రాహ్మణ సంఘం నాయకులు వావిలాల సుజీవన్, శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, సర్పంచ్ బాబు నాయక్, యువజన కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖదీర్, భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొని బూర్గుల రామకృష్ణా రావుకు ఘన నివాళులర్పించారు..

# సంకల్ప డీ-అడిక్షన్ సెంటర్‌లో యువకుడి మృతి

### రెండు నెలల్లోనే ఇద్దరు వ్యక్తులు మృతి
### మద్య విముక్తి చికిత్స కోసం చేరిన నాగార్జున కన్నుమూత.. పోలీసుల దర్యాప్తు,

హస్తినాపురం,జ్యోతి ప్రభంజనం సెప్టెంబర్14:మద్యానికి బానిసై ఆరోగ్యం క్షీణించడంతో మద్య విముక్తి చికిత్స కేంద్రంలో చేరిన ఓ





వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.వనస్థలిపురంలోని హైకోర్టు కాలనీకి చెందిన గంజి నాగార్జున (37) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో కుటుంబ సభ్యులు అతడిలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో గురుద్వార్ రోడ్డు మార్గంలోని సంకల్ప డీ-అడిక్షన్ సెంటర్‌లో గురువారం, రోజు చేర్పించారు.సెప్టెంబర్ 14. సోమవారం, ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో నాగార్జున బెడ్‌పై పడుకుని ఎంతకీ లేవకపోవడంతో సెంటర్ నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న వారు నాగార్జునను సమీపంలోని ప్రాగ్మా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ వైద్యుడు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



మృతదేహానికి సంబంధించిన పోస్టుమార్టం రిపోర్టు, ఇతర వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.వ్యసన విముక్తి కేంద్రాల పర్యవేక్షణపై ప్రశ్నలు మద్యం వ్యసనం నుంచి బయటపడేందుకు చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది.సంకల్ప డి-అడిక్షన్ సెంటర్ ను పరిశీలించినట్లయితే అందులో 70మందికి పైగా పేషెంట్లు, పదిమంది స్టాప్‌తో కలిపి 80కి పైగా నివాసం ఉంటున్నారు.80 మందికి 3. బాత్రూములు. 30 బెడ్లు.. ఒకే హాల్లో 80 మందికి పైగా నివాసం ఉండడం ఆశ్చర్యం తలపిస్తుంది.అక్కడే బాత్రూములు కంపు కొడుతుండటం..రోగము తగ్గక పోగా..ఎక్కువైతుందని ఆందోళన కలిగిస్తుంది.ఇటువంటి సెంటర్లపై వైద్య అధికారుల బృందం పర్యవేక్షణ జరిపి కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా డీ-అడిక్షన్ కేంద్రాల్లో వైద్యుల పర్యవేక్షణ, అత్యవసర వైద్య సదుపాయాలు, రోగుల ఆరోగ్య పరిస్థితులపై నిరంతర నిఘా అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే నాగార్జున మృతికి ఖచ్చితమైన కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# విఘ్నరాజు వైభవం: మట్టి బొమ్మలో దాగున్న మహత్తర ఆధ్యాత్మిక సందేశం

### వినాయక చవితి.. ఆర్భాటం కాదు, ఆత్మజ్ఞానానికి ఆహ్వానం!

మట్టి విగ్రహంలో మహత్తర జీవన సత్యం.. గణపతి తత్వంలో వ్యక్తిత్వ వికాస పాఠాలు.ప్రకృతి పరిరక్షణే నిజమైన భక్తి నివాళిభాద్రపద శుద్ధ చతుర్థి.. భారతీయుల ఆధ్యాత్మిక జీవితంలో అత్యంత పవిత్రమైన రోజు. వినాయకుని ఆగమనంతో వీధులన్నీ పండుగ శోభను సంతరించుకుంటాయి. మండపాలు, పూజలు, ప్రసాదాలు, భక్తుల సందడి ఎటుచూసినా కనిపిస్తాయి. అయితే ఈ ఆర్భాటాల నడుమవిఘ్నేశ్వరుని ఆరాధన వెనుకఉన్న అసలైన తత్వాన్ని, ఆధ్యాత్మిక సందేశాన్ని మనం గుర్తిస్తున్నామా? గణపతి రూపాన్ని, పూజా విధానాన్ని లోతుగా పరిశీలిస్తే మన జీవితాలను సరిదిద్దే ఎన్నో విలువైన పాఠాలు కనిపిస్తాయి.గణపతి రూపంలో వ్యక్తిత్వ వికాస సూత్రాలువినాయకుని ప్రతి అవయవం ఒక గొప్ప జీవన సందేశాన్ని అందిస్తుంది.పెద్ద తల విశాలమైన ఆలోచనలకు,జ్ఞాన సముపార్జనకు ప్రతీక. చిన్న కళ్ళు ఏకాగ్రతను,సూక్ష్మ దృష్టిని సూచిస్తాయి. పెద్ద చెవులు ఎక్కువగా వినాలని, చిన్న నోరు ఆచితూచి మాట్లాడాలని బోధిస్తాయి. విరిగిన దంతం ధర్మం కోసం త్యాగం చేయగల స్ఫూర్తిని గుర్తుచేస్తుంది.విశాలమైన ఉదరం జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమతుల్యంగా స్వీకరించే సహనానికి ప్రతీకగా భావించబడుతుంది. మూషిక వాహనం మనలోని చంచలమైన కోరికలను అదుపులో ఉంచుకోవాలనే సందేశాన్ని అందిస్తుంది.మట్టి నుంచి పుట్టి.. మట్టిలోనే లీనమయ్యే తత్వంవినాయక చవితి ప్రత్యేకతల్లో మట్టి విగ్రహానికి విశిష్ట స్థానం ఉంది. మట్టితో గణపతిని తయారు చేసి పూజించడం, అనంతరం నిమజ్జనం చేయడం ద్వారా సృష్టి, స్థితి, లయ అనే ప్రకృతి చక్రాన్ని గుర్తుచేసుకుంటాం. మన శరీరం ప్రకృతి నుంచే ఉద్భవించి చివరికి ప్రకృతిలోనే కలిసిపోతుందనే సత్యాన్ని ఈ ఆచారం తెలియజేస్తుంది.అందం, ఐశ్వర్యం, అధికారం, కీర్తి ఏవీ శాశ్వతం కావని తెలుసుకుని అహంకారాన్ని విడిచిపెట్టడం, నిరాడంబరమైన జీవనాన్ని అలవర్చుకోవడం గణపతి తత్వంలోని ప్రధాన సందేశం.పర్యావరణ పరిరక్షణే నిజమైన భక్తిపండుగల పేరుతో ప్రకృతికి హాని కలిగించడం భక్తి పరమార్థానికి విరుద్ధం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులు జలవనరులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే సహజ మట్టి, పర్యావరణహిత రంగులతో తయారైన వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలి. చెరువులు, నదులు, సరస్సులను కాలుష్యం నుంచి కాపాడుతూ పండుగను పర్యావరణ పరిరక్షణకు వేదికగా మలచాలి.ప్రకృతిని ప్రేమించడం, జీవజాలాన్ని కాపాడటం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం ద్వారా గణపతికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది.విఘ్నాలను అవకాశాలుగా మలచుకుందాంవిఘ్నేశ్వరుడు కేవలం ఆటంకాలను తొలగించే దేవుడు మాత్రమే కాదు.. వివేకంతో సమస్యలను ఎదుర్కొని విజయాన్ని సాధించాలనే స్ఫూర్తిని అందించే ఆరాధ్య దైవం. ఏ కార్యాన్ని ప్రారంభించే ముందు ప్రణాళిక, బుద్ధిబలం, పట్టుదల అవసరం. ఎదురయ్యే ప్రతి విఘ్నాన్ని ఒక పాఠంగా స్వీకరించి ముందుకు సాగినప్పుడే విజయతీరాలకు చేరుకోగలం.ఈ వినాయక చవితిని కేవలం ఉత్సవంగా కాకుండా, మనలోని అజ్ఞానం, అహంకారం, అసూయ, స్వార్థం వంటి అంతర్గత విఘ్నాలను తొలగించుకునే పవిత్ర సందర్భంగా మలచుకుందాం. గణపతి తత్వాన్ని ఆచరణలో పెట్టి జ్ఞానం, వినయం, పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవకు ప్రాధాన్యం ఇద్దాం.సమస్త ప్రజలకు వినాయక చతుర్థి శుభాకాంక్షలు!

# వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

నల్గొండ జిల్లా ప్రజలకు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ.నల్లగొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర



పవార్, ఐపీఎస్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లాలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ... జిల్లా ప్రజలకు, సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు.ప్రజలు పండుగను ఆనందంగా, సోదరభావంతో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్.బి. సీఐ నాగరాజు, ఆర్.ఐలు సంతోష్, సూరప్ప నాయుడు, కళ్యాణ్ రాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

### ఎస్ఐ పాకాల గీతా సూచనవివిధ గ్రామాల్లో పోలీసుల అవగాహన కార్యక్రమాలు




సారంగాపూర్ మండలం, సెప్టెంబర్ 14 (జ్యోతి ప్రభంజనం ):సారంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సారంగాపూర్ ఎస్ఐ పాకాల గీతా సూచించారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ మండపాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులకు పోలీసులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ పాకాల గీతా మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ సోదరభావంతో, మతసామరస్యాన్ని కాపాడుతూ జరుపుకోవాలని కోరారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, యువత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని, విద్యుత్ తీగలు, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలను పాటించాలన్నారు. డీజేలు, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.గణేష్ ఉత్సవాల సమయంలో సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు, వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని తెలిపారు. ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించి గణపతి నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ పాకాల గీతా కోరారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు సిబ్బంది, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాధనంతో కార్పోరేటర్లకు ఫోన్లు కొనివ్వడం సిగ్గుచేటు

### సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం



కరీంనగర్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 14:ప్రజలు ఇంటి పన్ను, నల్ల పన్ను,చెత్త పన్ను ఇలాంటి వివిధ పన్నుల ద్వారా చెల్లించిన డబ్బుల నుండి 66 మంది కార్పోరేటర్లకు, కో ఆప్షన్ సభ్యులకు సుమారు రూ 40,000 పెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కార్పొరేటర్లకు ఫోన్లు కొనివ్వడం సిగ్గుచేటని సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. గతంలో ఫోన్ల కోసం టెండర్లు వేయగా సిపిఎం ఆధ్వర్యంలో టెండర్లు రద్దు చేయాలని ఆందోళన చేసినప్పటికీ కార్పొరేటర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ సెల్ ఫోన్లు కొనుగోలు చేయడం అత్యంత విచారకరం అన్నారు. ప్రజలు వివిధ రూపాయలలో చెల్లించిన పన్నులను మున్సిపల్ అభివృద్ధికి, రోడ్లు డ్రైనేజీ ప్రజల సౌకర్యానికి వినియోగించవలసింది పోయి కార్పోరేటర్లు ఫోన్లు కొనుగోలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇన్నోవా కార్లలో తిరిగే కార్పొరేటర్లకు మొబైల్ కొనుగోలు చేసుకోవడానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. ప్రజల సౌకర్యం కోసమే ఫోన్ ద్వారా సమాచారం తీసుకుంటున్నాం అని కల్లి బొల్లి మాటలు చెబుతున్నారని, ప్రజల సమస్యలు విన్నవించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉందని, ఫోన్ ఇన్ కార్యక్రమం కూడా ఉందని వాటి ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా ప్రజల ధనంతో సెల్ ఫోన్లు కొనివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. అవసరం అనుకుంటే సిమ్ కార్డులు కొనిస్తే కార్పొరేటర్లకు ఫోన్ కొనుగోలు చేసే శక్తి ఉందని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికైనా కార్పొరేటర్లు కో ఆప్షన్ సభ్యులు సెల్ఫోన్లను వాపస్ ఇచ్చి ప్రజలకు సమాధానంగా ఉండాలని అన్నారు.

# ఘనంగా గుత్తా వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 14 తుర్కయంజాల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు గుత్తా వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు మునగనూరులోని వారి నివాసంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మునగనూరు పరిధిలోని వివిధ కాలనీల ప్రెసిడెంట్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని గుత్తా వెంకటరెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.?ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అభిమానులకు, నాయకులకు స్వీట్లు పంచారు. పార్టీ కోసం ఆయన చేస్తున్న సేవలను, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవను పలువురు కొనియాడారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలు

### పోతంగల్ మండలంలో ఉచితంగా 400 విగ్రహాల పంపిణీ



నిజామాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 14:పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలో 400 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ఉపయోగించి వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీ స్వామి వివేకానంద యూత్ సభ్యులు, లయన్ గంగాధర్ పటేల్ (లాయర్), చిత్తరి విపిన్ సేఠ్, బచ్చు రాము సేఠ్ దాతలుగా వ్యవహరించారు.కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు సుధాం భూమయ్య, పోతంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. లక్ష్మణ్, బి. సరోజ శాంతేశ్వర్ పటేల్, లయన్ సీతలే రమేష్, కల్లూరి భజరంగ్, చిత్తరి అశోక్, బందారి హన్మండ్లు, సెక్రటరీ నాగయ్య, సీతలే మోహన్, దశరథ్, గాండ్ల సాయిబాబా, వడ్ల దత్తు తదితరులు పాల్గొన్నారు. స్వామి వివేకానంద యూత్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పేద కుటుంబానికి జీవనోపాధి కల్పించిన జనసేన నేత సీతారామ్ నాయక్

### బీ టెక్ సమోసా వ్యాపారం ప్రారంభానికి సహకారం




రంగా రెడ్డి జిల్లా జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 14:పేద కుటుంబాలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎన్. సీతారామ్ నాయక్ తనవంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం చంపాపేట్‌లోని కోటక్ మహీంద్రా బ్యాంక్ ఎదురుగా వి. వర్మ, వి. శ్రీనులకు జీవనోపాధి కోసం బీ టెక్ సమోసా వ్యాపారాన్ని ప్రారంభించేందుకు సహకారం అందించారు.ఈ సందర్భంగా సీతారామ్ నాయక్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం చేయడం మాత్రమే కాకుండా, వారు స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ వ్యాపారం ద్వారా కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు పిల్లలను ఉన్నతంగా చదివించి మంచి భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని వర్మ, శ్రీనులకు సూచించారు.జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని పేదలు, నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని సీతారామ్ నాయక్ తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా స్థానికులు సీతారామ్ నాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. పేద కుటుంబానికి జీవనోపాధి కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.

# కనకదుర్గ కాలనీలో ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ పర్యటన

### దోమల సమస్య, నాలా ఆక్రమణలు, రహదారి సమస్యలపై అధికారులకు వినతి



హైదరాబాద్,జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 14:తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనాబ్ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ కార్వాన్ డివిజన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను కలిసి వారి పౌర సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో విపరీతమైన దోమల బెడద, నాలాలో పేరుకుపోయిన చెత్త, దుర్వాసన, నాలాను ఆక్రమించి చేపట్టిన అనధికార నిర్మాణాలు, సహజ నీటి ప్రవాహానికి ఏర్పడుతున్న ఆటంకాలు వంటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా ఇటీవల నిర్మించిన రహదారిలో లెవలింగ్ లోపాలు, నాణ్యతా సమస్యల కారణంగా ఇళ్ల ముందు నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దోమల నివారణకు తక్షణ చర్యలుస్థానికుల సమస్యలను తెలుసుకున్న ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో దోమల నివారణకు యాంటీ-మస్కిటో స్ప్రేయింగ్‌తో పాటు సాయంత్రం ఫాగింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేయించారు.అలాగే నాలాపై ఉన్న అనధికార ఆక్రమణలను పరిశీలించి, వాటిని తొలగించి నాలా సహజ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించేలా సంబంధిత అధికారులకు ప్రాతినిధ్యం చేశారు.రహదారి నాణ్యతపై అధికారులకు ఫిర్యాదుఅనంతరం ఇటీవల నిర్మించిన రహదారిని ఆయన పరిశీలించారు. పలు ప్రాంతాల్లో రహదారి సక్రమంగా లెవలింగ్ చేయకపోవడం, ఇళ్ల ముందు వర్షపు నీరు నిలిచిపోవడం వంటి సమస్యలను గుర్తించారు. రహదారిలో ఉన్న లోపాలను తక్షణమే సరిచేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లకు ప్రాతినిధ్యం చేశారు.జీహెచ్ఎంసీ చట్టం, అమలులో ఉన్న మున్సిపల్ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పనుల నాణ్యతను పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని లేదా లోపభూయిష్టంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత కాంట్రాక్టర్‌పై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.శాలువాతో సత్కరించిన కాలనీ వాసులుకనకదుర్గ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు, కాలనీ వాసులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ చేస్తున్న ప్రాతినిధ్యాలు, కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పొరేటర్ వేణు గౌడ్, అడ్వకేట్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అరుణ్ కుమార్, జగన్ గౌడ్, దుర్గ ప్రసాద్, అలీ బిన్ ఉస్మాన్ అల్ హజ్రీ, ఉసామా బిన్ ఉస్మాన్ అల్ హజ్రీ, అబ్దుల్ రషీద్ ఖాన్, మహ్మద్ అనస్ తదితర స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జనాబ్ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న పౌర సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో నిరంతరం ప్రాతినిధ్యం చేస్తానని తెలిపారు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులతో ఫాలోఅప్ కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com